
# ప్రేమ-డబ్బు-పెళ్ళి




**ఆ** ఇంట్లో యుద్ధం జరుగుతోందని నాకు తెలీదు. తెలిస్తే వెళ్లకపోదును. బాగా దగ్గరివాడినేమో! ఇంకేముంది? నువ్వే మధ్యవర్తివన్నారు.

తల వూగించక తప్పలేదు.

రాత్రి భోజనాలయ్యేసరికి తొమ్మిది గంటలు దాటిపోయింది. తర్వాత డాబామీద పక్కలు పరిచారు. ఎవరు పడుకున్నారని? నేను పిట్టగోడను ఆనుకుని కూర్చున్నాను. నాక్కొంచెం దూరంలో దంపతులిద్దరూ కూర్చున్నారు. అసలు హీరోయిన్ శారద మెట్లదగ్గర గోడపక్కనే నిలబడి ప్రకాశవంతంగా వెలుగుతున్న చంద్రుడిని చూస్తోంది.

"నువ్వుకూడా కూర్చోరాదూ" అన్నది అత్తయ్య కూతుర్ని ఉద్దేశించి.

ఒక్కసారి తల్లివైపు చూసి మళ్లీ చంద్రుడి మొహంలోకి చూడటం మొదలుపెట్టింది శారద.

"ఎక్కడికి పోతాయ్ తండ్రి గుణాలు, పోలికలూ?" గొణిగింది ఆమె.

ముసిముసిగా నవ్వాడు మామయ్య. ఆయన నవ్వులో అర్థాలన్నీ నాకు తెలుసు. శారద మా మామయ్యకు నకలు. పోలికలే కాదు. శారద గుణాలు కూడా తండ్రివే. ఈ విషయం మా బంధువర్గంలో అందరికీ తెలుసు.

"ఇంకెందుకు ఆలస్యం? ఇక యుద్ధం మొదలుపెట్టు" అన్నాడాయన నవ్వటం ఆపి.

ఆరోజు ఉదయమే ఒక విడత యుద్ధం జరిగి తాత్కాలికంగా ముగిసిందని భోజనాలకు ముందు శారద నాతో చెప్పింది. అంతేకాదు. కేవలం నాకే వినిపించేలా "నా ఇష్టాలకు వ్యతిరేకంగా నువ్వు మునిసిపాలిటీ సలహాలు ఇచ్చావంటే నిన్ను విలన్‌గా పెట్టి పెద్ద కథ రాస్తాను. ఆ తర్వాత బాధపడి ప్రయోజనం లేదు" అని ఓ వార్నింగ్ కూడా ఇచ్చింది.

నిజంగానే భయమేసింది. శారద అప్పుడప్పుడు కాదు. ఎప్పుడూ కథలు రాస్తూ వుంటుంది. ఆమెగారి కథలు ఈమధ్య తెగ అచ్చయిపోతున్నాయి. తనకు ఇష్టంలేని వాళ్లందరికీ రకరకాల రోగాలు వచ్చి బాధలు పడిపోతున్నట్లుగా కథల్లో రాస్తూ వుంటుంది శారద. నాలుగు నెలలక్రితం మాపిన్ని తనగురించి ఎవరిదగ్గరో ఏదో అన్నదిట. దాంతో శారదకు కోపం వచ్చి అప్పటికప్పుడు ఆమె మీద ఓ కథ రాసి ఏదో పత్రిక్కి పంపించింది. నెలక్రితమే ఆకథ అచ్చయ్యింది. ఆ కథను చదివి నా దగ్గరకు వచ్చి ఏడుస్తూ ఆ కథను నాకు చూపించింది మాపిన్ని. అందులో మా పిన్నికి భయంకరమైన క్షయవ్యాధి వచ్చినట్టూ, ఆరోగంతోనే ఆమె చనిపోయినట్టూ రాసింది శారద. ఈ విషయం తెలిసినదగ్గర్నించీ మా బంధువుల్లో అంతా శారద గురించి మాట్లాడటానిక్కూడా భయపడి చస్తున్నారు.

"మొదలు పెట్టేవేం? ఇంకెవరయినా రావాలా నీకు సపోర్టుగా" అన్నాడు మామయ్య మళ్లీ.

అత్తయ్యకు కోపం వచ్చింది.

"మీరే చెప్పొచ్చు గదా" అన్నది విసురుగా.

తల్లి విసురుకి శారద పక్కకు తిరిగి నవ్వుకోటాన్ని నేను గమనించాను.

ఇహ లాభంలేదని గొంతు సవరించుకొన్నాడు మామయ్య ఏదో హరికథ మొదలు పెట్టబోతున్నట్టు.

"ఒరేయ్... ప్రేమ గురించి నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు నన్ను.

"ఎవరూ? చిన్న మామయ్య పెద్దకూతురు ప్రేమలత గురించా నువ్వడిగేది?" అనడిగాను.

పెద్దగానే నవ్వేసింది శారద.

అత్తయ్యకూడా నవ్వే ప్రయత్నం చేసినట్టుంది.

"నువ్వెక్కడ దొరికావురా బాబూ... నేనడిగేది మనుషుల పేర్లు ఉన్న ప్రేమ గురించి కాదు. సాధారణమైన ప్రేమ గురించి" అన్నాడు వెనక్కు జరిగి గోడను ఆనుకుంటూ.

"సాధారణమైన ప్రేమ గురించి నాకు తెలీదు మామయ్యా. నేనెవర్నీ ఇంతవరకు ప్రేమించలేదు" అన్నాను.

"అయితే నువ్వు నీ పెళ్లాన్ని కూడా ప్రేమించటం లేదా?" అనడిగాడు ఆయన వెంటనే.

"ప్రేమో! ఏమో! తెలీదు. ఏమీ తెలీకుండానే సంసారం సాఫీగా సాగిపోతోంది. ఇంక ప్రేమించటం ఎందుకు? దండగ" అన్నాను.

"ఇక నువ్వు మాట్లాడవద్దు. ప్రేమ గురించి నీకు తెలియకపోయినా ఫర్వాలేదు. నేను చెప్పేది విను. ఆ తర్వాత బాగా ఆలోచించి నీ సలహా ఇవ్వు. ఏమంటావ్?" అన్నాడు నావైపు చూస్తూ.

సరేనన్నట్టు తలవూపాను.

వెన్నెల వెలుగు అంతటా పరుకున్నది. ఎక్కడినించో వస్తున్న గాలి జాజిపువ్వుల పరిమళాన్ని తీసుకువస్తోంది.

వెన్నెల్లో నిలబడిన శారద నీడ పొడుగ్గా నామీదకు పడుతోంది. చిరుగాలికి ఆమె పమిట అటూ ఇటూ కదులుతోంది.

అప్పుడప్పుడు రోడ్డుమీద ఒకటీ రెండు వాహనాలు పరుగెడుతున్న శబ్దాలు తప్పించి అంతగా సందడి లేదు.

"శారద ఓ యువకుడిని ప్రేమించింది. అతను నిరుద్యోగి. డిగ్రీ పూర్తయి రెండేళ్లు దాటినా ఇంకా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. శారద అతడిని ప్రేమించినట్టు నిన్ననే చెప్పింది. నిన్నయినా ఎందుకు చెప్పిందంటే అవసరం వచ్చింది కాబట్టి. ఓ వారం క్రితం శారదకు ఓ పెళ్లి సంబంధం చూశాము. అతను ఓ బేంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్కడే కొడుకు. కొంత పొలమూ, సొంత ఇల్లూ వున్నాయి. శారద వాళ్లకు నచ్చింది. వాళ్లు ఇరవైవేలు కట్నం అడిగారు. ఇక మిగిలిన విషయాలు మాట్లాడుకోవాలని అనుకుంటున్నప్పుడు తను ప్రేమించిన యువకుడి గురించి చెప్పి, తను అతన్నే పెళ్లిచేసుకుంటానని అన్నది. నిన్ననే అతడిని కలిశాను. అతను అందంగా వున్నాడు.

తెలివైన వాడు. కానీ దురదృష్టం ఏమిటంటే అతనికి ఆస్థిలేదు.

ఐనా నేను శారదను అతనికే ఇచ్చి పెళ్లి చేద్దామనుకున్నాను. కానీ మీ అత్తయ్య వొప్పుకోవడం లేదు. ఆ నిరుద్యోగికి ఇచ్చి తన కూతురి పెళ్లి చెయ్యటానికి వీలులేదని, ఆ బేంక్ ఉద్యోగికే ఇచ్చి చెయ్యాలనీ అంటున్నది. మామూలు పరిస్తితులలో అయితే అతనికిచ్చి చెయ్యడాఆనికి నేను వొప్పుకునే వాడిని కాదు. కాని శారద అతను ప్రేమించుకున్నారు. ఇద్దరు ప్రేమికులను అంతస్తుల పేరుతో విడదీయటాన్ని నేను అంగీకరించలేకుండా వున్నాను. ఇదీ మా సమస్య. ఈ సమస్య గురించి ఆలోచించి శారదను ఎవరికిచ్చి చెయ్యాలో చెప్పు" అన్నాడు మామయ్య.

ఆయన చెప్పినదంతా విన్న తర్వాత అసలు అత్తయ్య ఇద్దరు ప్రేమికులను విడదీయటానికి సిద్ధంగా వున్నాదని తెలిసిన తర్వాత ఆశ్చర్యపడకుండా వుండలేక పోయాను.

ఎందుకంటే అసలు మా అత్తయ్య, మామయ్య గొప్ప ప్రేమికులు. వాళ్లిద్దరి ప్రేమకథ నాకు తెలుసు. మామయ్యను చేసుకోడానికి అత్తయ్య తల్లిదండ్రులు వొప్పుకోకపోతే వాళ్లిద్దరినీ ఎదిరించి మామయ్యను చేసుకుంది.

"నమ్మలేకుండా వున్నాను" అన్నాను అత్తయ్య మొహంలోకి చూసి.

నవ్వింది అత్తయ్య.

"నీ సందేహం నాకు అర్థమయ్యింది అల్లుడూ. నా వాళ్ళందరినీ కాదని అప్పటికి పేదవాడయిన ఈ హీరోని వరించి పెళ్లిచేసుకొన్న నేను ఇలా ఎందుకు మారిపోయాననే గదా నీ అనుమానం? నిజమే. అప్పట్లో నాలో ఆవేశం తప్పించి మరొకటి లేదు. ఈయన్ను నా ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన మాట నిజం. అయితే జరిగిందేమిటి? చదువుకున్నా పెళ్లయిన ఏడాదిక్కూడా ఈయనకు ఉద్యోగం దొరకలేదు. ఈ ఏడాదిలో మేము అనుభవించిన నరకం ఆ దేవుడికే తెలియాలి. ఆ కష్టాల మధ్య, బాధల నడుమ మామధ్య వున్న ప్రేమ అడుగున పడిపోయింది.

అసలయిన జీవితం ఏమిటో తెలిసింది. కళ్లలో కళ్లు పెట్టి చూస్తూ కాలాన్ని గడపటం కథల్లో, సినిమాల్లో సాధ్యపడుతుందేమోగానీ నిజజీవితంలో సాధ్యంకాదు. పోనీ అలాగే అనుకున్నా ఎన్ని రోజులు? ఒకరోజు, రెండు రోజులు. ఈయన్ని చేసుకుని పొరపాటు చేశానేమో అనిపించింది. అప్పుడు నన్ను నేను నిందించుకున్నాను. నన్ను చేసుకుంటే నువ్వు సుఖపడలేవని ఆయన చెప్పారు. ఐనా నేను వినలేదు. ప్రేమకు వున్న బలం అటువంటిది. తప్పు నాదే. ఐతే ఆ కష్టాలు కలకాలం నిలవలేదు. చిన్న మొత్తంతో మొదలుపెట్టిన వ్యాపారం పెద్దపెట్టున విస్తరించింది. వ్యాపారంతో శారద- శారదతో వ్యాపారం పోటీపడుతూ పెరిగాయి. ఒకప్పటి దురదృష్టమే వెంట తరిమివుంటే మేమెంతగా

కుమిలిపోయి వుండేవాళ్లం?"

"ఇప్పుడు శారదకూడా ఒకప్పుడు నేను చిక్కుకున్న పరిస్థితులలోనే దిగబడిపోతున్నది. అతన్ని పెళ్లిచేసుకున్న తర్వాత ఆ పేదరికాన్ని భరించలేక అసలు జీవితం అంటే ఏమిటో తెలిసి జీవితం పట్ల ప్రేమను, ఆకర్షణను పోగొట్టుకుని తను పొరపాటు చేశానని నా కూతురు బాధపడటాన్ని నేను వూహించలేకుండా వున్నాను. అందుకే శారదను ఆ బేంక్ ఉద్యోగస్తుడికి ఇవ్వాలని అంటున్నాను. నువ్వు చెప్పు... నేనిలా ఆలోచించడంలో తప్పేమిటి?" అనడిగింది అత్తయ్య నన్ను నిలదీస్తున్నట్టు.

ఎవర్ని సమర్థించాలి??

ప్రేమ ముఖ్యమయినదే అయినా ఆర్థిక సిద్ధాంతాలే అసలు జీవితాన్ని నడిపిస్తాయి- అనేది అత్తయ్య నమ్మకం.

జీవించటానికి ప్రేమే ముఖ్యమంటాడు మామయ్య.

శారద నన్నే చూస్తోన్నది. ఆమె చూపులలోని అర్థాన్ని నేను కనిపెట్టాను. ఐతే ఇప్పటి శారద చూపులో బెదిరింపు లేదు. ఎలాగయినా తన తండ్రిని సపోర్టు చెయ్యమనే అర్థింపు వున్నది. శారద తెలివితేటలమీద నాకు నమ్మకం వున్నది.

ఐతే ఎక్కువసేపు ఆలోచించే అవసరం లేకుండానే ఈ సమస్యకు పరిష్కారం కనిపించింది. నేను సూచించే మార్గం వాళ్లిద్దరికీ నచ్చుతుందో లేదో తెలీదు.

ఐనా, "మరి నేను చెప్పనా" అన్నాను.

శారద వచ్చి నాక్కొంచెం దూరంలో కూర్చున్నది.

దంపతులిద్దరూ నాకు మరింత దగ్గరగా జరిగి "చెప్పు" అన్నారు.

"నిజంగా ఈ సమస్య గురించి మీకంటే ఎక్కువగా ఆలోచించగలిగే శక్తి నాకులేదు. నాకు వచ్చిన ఈ ఆలోచన మీకు ఇంతకుముందు వచ్చిందో రాలేదో నాకు తెలీదు. ఐనా చెబుతాను. నా దృష్టిలో జీవితమంటే ప్రేమ ప్లస్ డబ్బు. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకపోయినా జీవితం సారహీనంగానే కనపడుతుంది. అన్ని అనుభూతులకీ అతీతంగా యాంత్రికంగా జీవితాన్ని నెట్టుకుపోయే మనుషులు కొంతమంది వున్నారు. వాళ్లకు ఈ ఫార్ములా వర్తించదు. కాని శారద అలా కాదు. మీ ప్రేమకథ శారదకు తెలుసు. అందుకే మీరు నడిచిన దారిలో తను కూడా నడవాలని అనుకుంటున్నది"

"అత్తయ్యా... ఆర్థికపరమయిన ఇబ్బందులు ప్రేమను, ఆకర్షణను తొక్కిపట్టేస్తాయనే నీ సిద్ధాంతాన్ని నేనుకూడా వొప్పుకుంటాను. ఒకనాటి నీ కథకు ఇప్పటి శారద కథకీ కొంచెం భేదం వుంది. మీరిద్దరూ కొంచెం విశాలహృదయంతో ఉదారంగా వ్యవహరిస్తే

ఈ సమస్యకు మంచి పరిష్కారం దొరుకుతుంది. ఎలాగంటే శారద ప్రేమించిన యువకుడు ఇప్పుడు పేదవాడు. కాని మీరు ఆ బేంక్ ఉద్యోగికి ఇవ్వటానికి సిద్ధపడిన ఇరవైవేల రూపాయలనూ ఇతనికే ఇస్తే అతనూ కొంత వున్నవాడు అవుతాడు. అతను చురుకయినవాడు కాబట్టి ఆ ఇరవై వేలతో అతనిచేత ఏదయినా వ్యాపారం చేయిస్తే అతను కూడా కొన్నాళ్లకు ఇప్పటిమీ స్థాయికి చేరుకుంటాడు. ప్రేమికులను కలిపినట్టూ వుంటుంది. అతనికీ ఓ దారి చూపినట్టూ వుంటుంది"

నా పరిష్కారం మా మామయ్యకు బాగా నచ్చింది. అందుకే "గుడ్... వెరీగుడ్... మంచి ఆలోచన. ఇలా చేస్తే బావుంటుంది. ఆ ఇరవైవేలతో వేరే వ్యాపారం చేయించవలసిన అవసరం కూడా లేదు. ఆ డబ్బును నా వ్యాపారంలోనే పెట్టుబడిగా పెట్టించి అతగాడిని నా భాగస్తుడిగా చేర్చుకుంటాను. అందులోనే అతను నెలజీతంమీద ఉద్యోగిగా పనిచేస్తాడు. ఏమంటావ్ డియర్?"అన్నాడు అత్తయ్యతో.

ఇంకా ఇలా అన్నాడు మామయ్య-

"శకూ... ఒకప్పుడు నన్ను చేసుకోటానికి నువ్వు లేవదీసిన విప్లవాన్ని ఒక్కసారి గుర్తుచేసుకో... తాత్కాలికంగా నువ్వు కష్టాలు అనుభవించినా ఆ తర్వాత జీవితం స్వర్గమే అయ్యింది. ఒకప్పుడు నువ్వు నడిచిన దారిలోనే ఇప్పుడు శారదకూడా నడుస్తానని అంటున్నది. నువ్వెందుకు భయపడతావు? నేను గట్టిగా చెప్పగలను. ఈ దారిలో శారద తాత్కాలికంగా కూడా కష్టాలు అనుభవించలేదు. ఆరోజు నీకు తల్లిదండ్రుల సపోర్టు లేదు. కాని ఈరోజు శారదకు మనసపోర్టు వుంది. అతన్ని చేసుకుంటే శారద సుఖపడుతుందని నేను నమ్ముతున్నాను. నువ్వేమంటావ్?" అని అడిగాడు మామయ్య.

అత్తయ్య పూర్తిగా బయటపడిపోకుండా "ఏమయినా మీరంతా వొకటి. అప్పుడు కూడా ఇలాంటి కబుర్లే చెప్పి నన్ను వల్లో వేసుకున్నారు. ఏమయినా అది పూర్తిగా మీకూతురే. మీ కూతురు మీ ఇష్టం. మధ్యలో నేనెవర్ని? మీ ఇష్టంవచ్చినట్లు చేసుకోండి" అన్నది తన పక్కమీద పడుకొంటూ-

"థాంక్యూ శకూ... ఇక హాయిగా నిద్రపో..." అని మామయ్య నావైపు తిరిగి "ఒరేయ్.. ఏదయినా ఒక విషయాన్ని వొప్పుకోబోయేముందు మీ అత్తయ్య ఇలాగే మాట్లాడుతుంది. నువ్వు ఆశ్చర్యపడకు... పొద్దుపోయింది. ఇక పడుకోండి... అప్పుడే పదిన్నరదాటింది" అన్నాడు మామయ్య తనూ పడుకుంటూ-

నేను సూచించిన పరిష్కారం మామయ్యకు, అత్తయ్యకు నచ్చినందుకు సంతోషం కలిగింది. ఏవో ఆలోచనలతో నిద్రపట్టలేదు.

ఓ గంట గడిచేసరికి మా అత్తయ్య గాఢ నిద్రలోకి జారుకున్నది. ఆమె నిద్రలో

మునిగిపోయిందని నిర్ధారణ చేసుకున్న తర్వాత మామయ్య నావైపు తిరిగి "ఒరేయ్ సుందరం. నువ్వు సూచించిన పరిష్కారాన్ని నేనెప్పుడో ఆలోచించాను. కాని నేనే ఈ ఆలోచన గురించి చెబితే తండ్రీ కూతుళ్ళిద్దరూ కలిసి నాటకం ఆడుతున్నారని మీ అత్తయ్య గొడవ చేస్తుందని నేను బయటపెట్టలేదు. విస్తృతమవుతున్న నా వ్యాపారాన్ని సమర్థవంతంగా రన్ చెయ్యటానికి ఓ నమ్మకస్తుడయిన మనిషి కావాలి. ఆ మనిషి నా అల్లుడే అయితే అంతకంటే కోరుకునేది ఏముంది?" అన్నాడు నవ్వుతూ-

"నువ్వు మా అమ్మను సపోర్టు చేస్తావేమోనని భయపడ్డాను. థాంక్స్ బావా... రేపు నేను ఓ కథ రాయబోతున్నాను. అందులో నువ్వు హీరోవి" అన్నది శారద లేచి కూర్చుని.

"వద్దు... నామీద కథ రాయొద్దు" అన్నాను భయంగా.

"భయపడకు. అందులో నీకు ఏ జబ్బూ వుండదు. మంచి హెల్దీ యంగ్ హీరోవి" అన్నది నవ్వుతూ శారద.

(సెప్టెంబరు 1982 విజయ మాసపత్రికలో ప్రచురితం)